క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్

మాచర్ల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలోని ప్రతి ప్రాంతంలో ఎక్కడా రాజీ పడకుండా వర్షంలో సైతం పురపాలక సంఘ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 31 వార్డులలో 100 మంది పారిశుద్ధ్య కార్మికులతో ఎక్కడికక్కడ చెత్తను తొలగించి శుభ్రపర్చటం, బ్లీచింగ్ చల్లించటం జరుగుతుందన్నారు. కాలువల్లో మురుగు తొలగించి ఆరగానే డంపింగ్ యార్డుకు తరలించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాల వలన తాగునీటి విషయంలో ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అపరిశుభ్రంగా పరిసరాలను ఉంచుకోవద్దన్నారు. ఆయా వార్డులలో పారిశుద్ధ్య సమస్యలుంటే సంబంధిత సచివాలయ అడ్మిన్లకు, పారిశుద్ధ్య పర్యవేక్షకులకు తెలపాలన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో నరసింహ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు, అన్ని ప్రభుత్వ శాఖల పనితీరు, తాగునీటి సమస్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

చిన్నారుల చిట్టి సంకల్పం వెలకట్టలేనిది



కారెంపూడి: పర్యావరణాన్ని కాపాడాలనే తపన విద్యార్థుల్లో ఉదయించిన వేళ ఆ చిట్టి సంకల్పం వెల కట్టలేనిది. మండలంలోని పెద కొదమగుండ్ల పాఠశాల విద్యార్థులు వందలాదిగా విత్తన బంతులు తయారు చేసి వాటిని కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)కి శుక్రవారం అందించారు. ప్రకృతి పాఠం బోధించడానికి పాఠశాలకు వెళ్లిన జాజికి విద్యార్థులు ఎంతో కష్టపడి బంక మట్టి, ఎరువు మిశ్రమంతో మట్టిలో విత్తనాలు పెట్టి తయారు చేసిన విత్తన బంతులను జాజికి అందించారు. నిజంగా పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థులకు ఉన్న స్ఫూర్తిని వారికి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుల గొప్పతనానికి జాజి ధన్యవాదాలు తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి సహకారం

ముప్పాళ్ల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో క్షేత్రస్థాయి వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ సిబ్బందికి శుక్రవారం ఈ అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఏఓ అరుణ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. పథకం ఏపీఓ జి.ఏడుకొండలు మాట్లాడుతూ.. మండలంలో 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాల్సి ఉందన్నారు. 19 రకాల మొక్కలను, సాగుకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఐదెకరాలలోపు రైతులు అర్హులని చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకం, నీటి సదుపాయం, జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి నవీన్, పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుపూర్ణిమ వేడుకలు

క్రోసూరు: గురుపూర్ణిమను పురస్కరించుకుని మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు శుక్రవారం తెలిపారు. మందిరంలో 10 రకాల తీర్థప్రసాదాలు అందించే ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

సత్తెనపల్లి: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని లాం ఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్, సమన్వయకర్త డాక్టర్ ఎం.వెంకటరాములు సూచించారు. పట్టణంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణలో వారు మాట్లాడారు. ప్రస్తుతం పత్తి పంటలో అధిక వర్షాల సమయంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించాలన్నారు. మిరప నారు మడులలో చేపట్టవలసిన విత్తన శుద్ధి, యాజమాన్య పద్ధతులను వివరించాలని కోరారు. వరి పంటలో తక్కువ కాలపరిమితి, తెగుళ్లను తట్టుకునే వంగడాలపై అవగాహన పెంచాలని సూచించారు. శిక్షణలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, తదితరులు ఉన్నారు.

కార్యదర్శుల కొరత.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు

- గ్రామాల్లో నత్తనడకన పనులు
- పలు పంచాయతీలకు ఇన్‌చార్జిలే దిక్కు
- పారిశుద్ధ్య నిర్వహణ మందగమనం



గంగవరంలో అపరిశుభ్రంగా ఉన్న రహదారి



గ్రామ పంచాయతీ కార్యాలయం

గురజాల: అసలే వర్షాకాలం... అందులోను వ్యాధులు సంక్రమించే కాలం. నియోజకవర్గంలోని పంచాయతీలకు కార్యదర్శుల కొరత వేధిస్తుంది. దీంతో పాలన స్తంభించి గ్రామాల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఒక్కో కార్యదర్శికి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీలు కేటాయించడంతో గ్రామ పాలన దాదాపుగా స్తంభించిపోయింది. రక్షిత మంచినీటి పథకం సరిగ్గా లేక ఆయా గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి లైట్ల నిర్వహణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పన్నుల విధింపు, వసూళ్లతో పాటు పలు విభాగాల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. పలు పంచాయతీల్లో ప్రజలు కార్యదర్శుల కొరకు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుంది. వ్యయ ప్రయాసలతో అక్కడికి వెళితే కార్యదర్శులు అందుబాటులో లేక ప్రజలు నిరాశగా వెనుదిరగాల్సి వస్తుంది. ఇన్‌చార్జి కార్యదర్శులు ఎక్కడ ఉంటారో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కార్యదర్శుల నియామకం చేపట్టాలి...

కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చింది. అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలంటే సమర్థవంతమైన అధికారులు ఉండాలి. గ్రామ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటే సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. అధికారులు లేని గ్రామాలకు అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా...

గురజాల నియోజకవర్గంలో గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాలు కలవు. వీటిలో గురజాలలో–12 గ్రామ పంచాయతీలకు గాను 8 మంది కార్యదర్శులు, దాచేపల్లిలో–14 గ్రామ పంచాయతీలకు.. 7 మంది, మాచవరంలో 15 గ్రామ పంచాయతీలకు.. 17 మంది, పిడుగురాళ్ల మండలంలో 16 గ్రామ పంచాయతీలకు.. 8 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. గురజాల మండలంలో 4 గ్రామ పంచాయతీలకు, పిడుగురాళ్లలో 8 పంచాయతీలకు ఇంచార్జీలుగా పాలన అందిస్తున్నారు.

వీడని వర్షాలు.. పత్తి రైతుల దిగాలు



కారెంపూడిలో సాగులో ఉన్న పత్తి పంట

కారెంపూడి: విడవకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి రైతులు దిగాలు పడుతున్నారు. పైర్లు బాగున్నాయి తమ కష్టాలు గట్టెక్కుతాయని పత్తి రైతులు చాలా ఆశగా ఉన్నారు. పత్తి చేసు చూసి ఇంత కాలం మురిసి పోయిన రైతులు ఇప్పుడు పంట దుస్థితిని చూసి బాధపడుతున్నారు. చేలో వర్షానికి రాలిన గూడ, పూత, పిందె వారికి దర్శనమిస్తున్నాయి. అలాగే పక్వానికి వచ్చిన కాయల తొడిమల్లో నీరు చేరి అవి నల్లగా మారడం.. అవి విచ్చినా నాణ్యతగా లేకపోవడం, పత్తి విరుపులు చేయిద్దామన్నా ఆగని వర్షంతో వీలు కాక రైతులు దిగులు చెందుతున్నారు. వాస్తవంగా మండలంలో 2,200 ఎకరాలలో వేసిన పత్తి పైర్లు వర్షాలకు ముందు వరకు చాలా ఆశాజనకంగా ఉన్నాయి. ముందస్తుగా ఏప్రిల్ నెలలో వేసిన పైర్లలో పత్తి విచ్చి విరుపులకు సిద్ధంగా ఉంది. అయితే ఆ పత్తి తీయిద్దామంటే వర్షం ఆగకుండా పడుతుండడంతో వీలు కావడం లేదు, విచ్చిన పత్తి వర్షానికి తడిసి పాడైపోతోంది. అలాగే తడిసిన కాయలు పగిలినా ఆ పత్తి నాణ్యత లేకుండా ఉంటోంది. గత పదవ తేదీ నుంచి మండలంలో వర్షాలు పడుతున్నాయి. 16, 17 తేదీలు తప్ప.. పదో తేదీ నుంచి వర్షాలు పడుతూనే ఉన్నాయి. దానికి తోడు నిరంతరం మబ్బులు కమ్మి సూర్యుని కాంతి జాడ లేకపోవడంతో పైర్లపై పురుగుల ఉధృతి కూడా పెరిగింది. ఈ పరిస్థితి పత్తి రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. వర్షం ఎప్పుడు ఆగి ఎండ కాస్తుందా అని పత్తి రైతులు ఎదురు చూస్తున్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పిడుగురాళ్ల: రైతుల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం, కార్మిక సంఘ నాయకులు అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని రైతు సంఘం, కార్మిక సంఘ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదన్నారు. రైతులు ఎటువంటి సహాయం అందక ప్రైవేటు వ్యాపారుల వద్ద నుంచి వడ్డీకి అప్పులు తీసుకొని నానా అవస్థలు పడుతున్నారన్నారు. పీఎం కిసాన్ నిధులు రకరకాల కారణాలతో రైతులకు మోదీ ప్రభుత్వం ఎగనామం పెట్టిందన్నారు. పల్నాడు జిల్లాలో నకిలీ ఎరువులతో ఇబ్బందులు పడుతున్నారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందలేదన్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భక్తులు వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు బుంగ నాగేశ్వరరావు, మజ్జిగ నరసింహారావు, వెన్ను వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కరెంట్ విషయంలో జాగ్రత్తలు పాటించండి

విద్యుత్ శాఖ డీఈ హరిబాబు



మాచర్ల: వర్షాలు కురుస్తున్న పరిస్థితులలో పలు ప్రాంతాలలో విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశముంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాచర్ల విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ వైర్లు తెగిపడితే ఎవరూ ముట్టుకోకుండా వెంటనే విద్యుత్ శాఖ మండల ఏఈలకు, సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. వర్షాలు అధికంగా కురిస్తే పలు చోట్ల బలహీనంగా ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడే పరిస్థితి ఉందని, ఇనుప విద్యుత్ స్తంభాలను ఎవరూ ముట్టుకోవద్దన్నారు. గృహాలు వ్యాపార సంస్థలలో పనిచేసే వారు విద్యుత్ లైట్లను వేయటం, ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు వంటివి ఆన్ చేసేటప్పుడు తడిచేతులతో బోర్డులు ముట్టుకోకూడదన్నారు. ఎర్త్ అయ్యే అవకాశం ఉందని, విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు.

మాచర్లలో భారీ వర్షం



మాచర్ల: పట్టణంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీగా వర్షం కురిసింది. అల్పపీడనం ప్రభావంతో గురువారం రాత్రి నుంచి పట్టణంలో వర్షం కురుస్తూనే ఉండడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బస్టాండ్ సెంటర్, రింగురోడ్డు, చెన్నకేశవ కాలనీ, విద్యుత్ కార్యాలయం తదితర ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచి రోడ్లు బురదమయంగా మారాయి. ఈ వర్షంతో రైతులకు మేలు జరుగుతుందని రైతులు ఆనంద పడుతున్నారు.

రెండు రోజులుగా వర్షం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో గత రెండు రోజులు నుంచి విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. వర్షం వలన శివారు కాలనీలు నీటితో బురదమయ్యాయి. రైతులు ఇప్పటికే పంటలను వేశారు. అయితే ఆ పంటలు వర్షం నీటిలో మునిగి పోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఎండలు.. ఇప్పుడు వర్షాలు పడుతుండటంతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు.

ఘనంగా అమృత వర్షోత్సవ కార్యక్రమాలు



మాచర్ల: బ్రహ్మశ్రీ సద్గురు ముసలయార్య దేశిక స్వామి వారి జయంతి పురస్కరించుకొని 75వ అమృత వర్షోత్సవ ఆరాధన మహోత్సవాలు మూడు రోజులుగా జరుగుతున్నాయి. వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలోని జ్ఞానాశ్రమంలో జ్ఞానాశ్రమ బ్రహ్మశ్రీ కాశీ విశ్వనాధస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజీలు, పీఠాధిపతులు, భక్తులు పాల్గొన్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

కారెంపూడి: వర్షాలు బాగా పడుతున్న పరిస్థితుల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి సంబంధిత శాఖల ఉద్యోగులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత శాఖల ఉద్యోగులతో ఎంపీడీవో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ పరిధిలోని నీటి పారుదల లేని డ్రైన్లను గుర్తించి పూడు తీయించాలని, అదే విధంగా ఇళ్ల పరిసరాలలో వ్యర్థాలు చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే బోర్లలో నీటిని పరిశీలించాలని తరచూ తాగు నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. తర్వాత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశీలించాలని విద్యార్థులు తినే మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించాలన్నారు. ప్రతి రోజు అధికారులు తప్పనిసరిగా ఏదో సెంటర్‌ను పరిశీలించి నివేదికను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీలతో సహా అందరూ వారంలో ఒకటి రెండు సార్లు తప్పనిసరిగా ఈ విధుల నిర్వహణలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే రైతులను పండ్ల తోటల పెంపకం వైపు దృష్టి సారించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వారికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎంపీడీవో వివరించారు. అందరు ఉద్యోగులు, అధికారులు విధులకు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని పేర్కొన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ పి.సత్యప్రసాద్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కోటిరెడ్డి, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు



కారెంపూడిలో సాగులో ఉన్న పచ్చి రొట్ట పైరు

కారెంపూడి: ఆగస్టు నాటికి సాగర్ కాల్వలకు నీరు రావచ్చనే ఆశలు రైతుల్లో ఇప్పుడిప్పుడే చిగురిస్తున్నాయి. ఆల్మట్టి గేట్లు ఎత్తడంతో సాగర్‌కు నీరు వస్తుందనే ఆశలు ఆయకట్టు రైతుల్లో నెలకొంటున్నాయి. దీంతో మాగాణి భూముల సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. భూములు బాగు చేసుకుంటున్నారు. నీరు వచ్చే లోపు భూముల్లో పచ్చి రొట్ట పైర్లు సాగు చేసుకుని భూసారం పెంచుకోవాలని ఆశ పడుతున్నారు. సాగర్ డ్యాంకు నీరు రావడం ప్రారంభమైన క్షణం నుంచి పచ్చి రొట్ట విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ వచ్చే అవకాశాలున్నాయి. విత్తనాలు ఎన్ని అవసరమవుతాయనే విషయాన్ని పరిశీలిస్తే.. గత ఏడాది మండలంలోని 15 గ్రామాల రైతులకు 560 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలను మండల వ్యవసాయ శాఖ పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏడాది కాల్వలకు నీరు వస్తుందో రాదోననే సందేహంతో రైతుల నుంచి ఇప్పటి వరకు పచ్చి రొట్ట పైర్ల విత్తనాల కోసం అంతగా డిమాండ్ రాలేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 100 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు మాత్రమే రైతులు తీసుకున్నారని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వాటిలో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలున్నాయి. శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి రాక మొదలు కావడంతోనే మాగాణుల్లో వరి సాగు హడావుడి మొదలయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది లాగానే సుమారు 500 నుంచి 560 క్వింటాళ్ల దాకా వివిధ రకాల పచ్చి రొట్ట విత్తనాలు అవసరం కావచ్చు. ఇప్పుడు పచ్చి రొట్ట పైర్లు సాగు చేస్తున్న వారంతా బోర్ల కింద వరి సాగు చేయడానికి సన్నద్ధం అయిన వారే. ఇక కాల్వల కింద వరి సాగు అవకాశాలు మెరుగు పడితే పచ్చి రొట్ట విత్తనాల కోసం రైతులు ఎదురు చూసే పరిస్థితి రావచ్చు. బోర్ల కింద వరి సాగు చేయాలని సంకల్పించిన రైతులు పచ్చి రొట్ట పైర్లు పెంచుకుంటూ మరోపక్క వరి నారు మళ్లు కూడా పోసుకుంటున్నారు. ఇప్పటికే మాగాణి భూములను బాగు చేసుకునే పనులు రైతులు చేపట్టారు. మొత్తం మీద రైతుల్లో ఖరీఫ్ వరి సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి.

దేశభక్తికి ప్రతిరూపం సైనికులు

ఎన్‌సీసీకి 30 మంది విద్యార్థుల ఎంపిక



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులు

పిడుగురాళ్ల రూరల్: దేశభక్తికి నిలువెత్తు రూపం మన సైనికులని వారి స్ఫూర్తితో క్రమశిక్షణ కొరకు ఎన్‌సీసీ ఏర్పాటు చేయడం జరిగిందని తిరుమల ఆక్స్‌ఫర్డ్ ప్రిన్సిపాల్ నరేష్ అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల్లో 25వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు శరీర దారుఢ్య పోటీలు నిర్వహించారు. అనంతరం 30 మందిని ఎంపిక చేసి, బయోమెట్రిక్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా యువతకు, విద్యార్థులకు ఎన్‌సీసీ ద్వారా శిక్షణ అందిస్తూ వారిలో దేశభక్తి, ఆత్మవిశ్వాసం, సేవాభావం నింపుతూ మంచి పౌరులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. వాటితో పాటు చైతన్యం, సాహసం, నాయకత్వ లక్షణాలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ ఎంపికలో సుబేదార్ చంద్రప్ప, హవల్దార్ రాంసింగ్, అసిస్టెంట్ ఎన్‌సీసీ ఆఫీసర్ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఆర్యవైశ్యుల అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘు నాయకులు

మాచర్ల: పట్టణంలో 20 రోజులుగా శ్రీలక్ష్మీచెన్నకేశవ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ సూరె యలమంద, ఆర్యవైశ్య సంఘ నాయకులు దారివేముల రామకృష్ణల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్యులంతా సమష్టిగా ప్రతి రోజు 400 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2.30 వరకు ఆర్ అండ్ బీ ప్రాంతంలోని అన్నా క్యాంటీన్‌లో ఆర్యవైశ్యులు అన్నదానం నిర్వహించారు. అన్నదానాన్ని పేద ప్రజలంతా ఉపయోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రారంభించే వరకు అన్నదాన కార్యక్రమాన్ని అన్న క్యాంటీన్‌లో నిర్వహిస్తామని ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి అనిల్, కంభంపాటి చంటి, విడేల కృష్ణ, గోళ్ళ జనార్ధన, గాలేశ్వరరావు, పోలా సత్యం, కటకం నాగేషు, డాల్ మిల్, రైస్ మిల్లుల సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కందిపప్పు, బియ్యం విక్రయం

పట్టణంలోని కోదండ రామాలయంలో డాల్ మిల్, రైస్ మిల్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో తక్కువ ధరకు కందిపప్పు, బియ్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. కందిపప్పు రేషన్ కార్డు కలిగిన ప్రతి పేదవానికి కేజీ రూ.160, బియ్యం రూ.49కు విక్రయించటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి పేద కుటుంబం ఉపయోగించుకోవాలని వారు కోరారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ విక్రయాలు కొనసాగుతాయని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

పత్తి రైతుకు 'గులాబీ' గుబులు

మెట్ట రైతుల పాలిట వరంగా భావించే పత్తి సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. ముఖ్యంగా గులాబీ పురుగుల ఉధృతి, తెగుళ్లు, తుపానులు, పెరిగిన పెట్టుబడులు, కోత కూలీల కొరత ప్రభావంతో రైతులు దీనిపై ఆసక్తి చూపడం లేదు. ఐదేళ్ల సాగు ప్రామాణికంగా వ్యవసాయ శాఖ అధికారులు సాధారణ సాగు విస్తీర్ణాన్ని నిర్ణయిస్తారు. ఆ ప్రకారం సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈ ఏడాది సగానికి పైగా పత్తి సాగు విస్తీర్ణం తగ్గిపోవడం గమనార్హం.



- సాగుపై అన్నదాతల తీవ్ర నిరాసక్తత
- సత్తెనపల్లి డివిజన్‌లో భారీగా తగ్గిన విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు



భీమవరంలో సాగు చేస్తున్న పత్తి పంట

సత్తెనపల్లి: సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 39,050 హెక్టార్లలో ఖరీఫ్‌లో పత్తి పంట సాధారణ సాగు కాగా.. ఈ ఏడాది కేవలం 12,481 హెక్టార్లకే పరిమితమైంది. తెగుళ్లు, గులాబీ పురుగుల దాడి, పంట మార్పిడిపై అధికారుల సూచనలు పాటించకపోవడమే కారణమని తెలుస్తోంది. ఎకరాకు రూ. 36 వేల నుంచి రూ. 50 వేల వరకు పెట్టుబడులు పెట్టినా ప్రయోజనం మాత్రం లేకుండా పోతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'వైఎస్సార్ రైతు భరోసా' కింద పెట్టుబడి సాయం సమయానికి అందించేవారు. ఇప్పుడు పీఎం కిసాన్ నిధి కింద రూ.2 వేలు మాత్రమే అందడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.20 వేలు పెట్టుబడికి ఇస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినా ఇంతవరకు అమలు చేయలేదు. రైతన్నలు ఆ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న, ఉద్యాన పంటలపై దృష్టి సారించారు. మరోవైపు అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పత్తి వైపు మొగ్గు చూపిన రైతులు కూడా ప్రస్తుతం ఆందోళనకు గురవుతున్నారు.

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్లో పత్తి సాగు విస్తీర్ణం వివరాలు (హెక్టార్లలో..)

మండలం	సాధారణ విస్తీర్ణం	ప్రస్తుత విస్తీర్ణం
సత్తెనపల్లి	6,596	1,870
ముప్పాళ్ళ	2,849	140
రాజుపాలెం	1,906	312
నకరికల్లు	521	26
పెదకూరపాడు	5,724	2,200
అమరావతి	7,550	3,785
అచ్చంపేట	5,343	1,014
క్రోసూరు	5,497	2,827
బెల్లంకొండ	3,064	307
మొత్తం	39,050	12,481

అమరావతి గురుకులంలో ఆకస్మిక తనిఖీలు



అమరావతి: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి కె.సునీల్ రాజ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వసతిగృహం, వంటశాల, మరుగుదొడ్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బోధనా పద్ధతులు, విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలకు సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అకడమిక్ సంయుక్త కార్యదర్శి సంజీవరావు, సంయుక్త కార్యదర్శి యోగేశ్వరరావు, రాజేష్, వైస్ ప్రిన్సిపల్ మేరీకళ, సిబ్బంది పాల్గొన్నారు.